క్లుప్తంగా

మైనంపల్లి వాహనం తనిఖీ


వాహనాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి హన్మంతరావు వాహనం తనిఖీ చేశారు. సోమవారం మెదక్ – చేగుంట ప్రధాన రహదారిపై వచ్చిపోయే వహనాలను ఎన్నికల బృందం (ఎస్ఎస్‌టీ టీం) అధికారులు తనిఖీలు నిర్వహించి వివరాలు నమోదు చేస్తున్నారు. ఇదే సమయంలో వచ్చిన మైనంపల్లి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం


గుర్తు తెలియని మృతదేహం

హవేళిఘనాపూర్(మెదక్): మండల పరిధిలోని పాతూర్ – రాయిన్‌పల్లి వెళ్లే అటవీ ప్రాంతంలోని వాగు దగ్గర గుర్తు తెలియని మృతదేహం గుర్తించినట్లు మెదక్ రూరల్ ఎస్‌ఐ అమర్ తెలిపారు. 40 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి ఒంటిపై తెల్లని దుస్తులు వేసుకున్నాడని, ఎవరైనా గుర్తిస్తే పోలీసులు సెల్ నంబర్‌కు 87126 57916కు సమాచారం అందించాలని ఆయన కోరారు.

కాల్వలో పడి వ్యక్తి మృతి

నిజాంపేట(మెదక్): మతిస్థిమితం లేని వ్యక్తి కాల్వలో పడి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం .. నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన గడ్డల జ్యోతిరాజ్ (55) కొద్ది రోజులుగా మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్నాడు. కాగా శనివారం రాత్రి మండల కేంద్రంలోని శ్రీచక్ర పౌల్ట్రీ ఫామ్ వద్ద నేషనల్ హైవే 765 డీజీ పక్కన కాల్వలో మృతి చెందాడన్నారు. ఆయన తలపై, కాళ్లపై గాయాలు కావడంతో చనిపోయాడని పోలీసులు తెలిపారు. మృతుడి భార్య శోభ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు చెప్పారు.

పరామర్శ

చేగుంట(తూప్రాన్): మండలంలోని కరీంనగర్‌లో ఇటీవల మృతి చెందిన రాజాగౌడ్ కుటుంబ సభ్యులను ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్‌పర్సన్ వెంటకయ్య సోమవారం పరామర్శించారు.

బీజేపీ జెండా ఎగరడం ఖాయం

దుబ్బాక: దుబ్బాక గడ్డపై మళ్లీ బీజేపీ జెండా ఎగరడం ఖాయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంబటి బాలేశ్ గౌడ్ అన్నారు. సోమవారం పట్టణంలోని డబుల్‌బెడ్రూం కాలనీలో బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రఘునందన్‌రావు దుబ్బాకను అన్ని విధాల అభివృద్ధి చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నేహాల్‌గౌడ్, రమణారెడ్డి, ప్రవీణ్ కుమార్, రాజశేఖర్, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

కొండపోచమ్మకు ముడుపు

జగదేవ్‌పూర్(గజ్వేల్): సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ విజయం సాధించాలని కోరుతూ ఎంపీటీసీల జిల్లా ఫోరం అధ్యక్షుడు కిరణ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం కొండపోచమ్మ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి ముడుపు కట్టారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కరుణాకర్, ఆంజనేయులు, స్వామి, బాల్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి

మర్కూక్ (గజ్వేల్): తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి కోరారు. సోమవారం మండలంలోని కర్కపట్ల, పాములపర్తిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరుమలరెడ్డి, మండల అధ్యక్షుడు కనకయ్య, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కే ఓటు అంటున్న దమ్మక్కపల్లి గ్రామస్తులు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని వెంకటాపూర్ అగ్రహారం, దమ్మక్కపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పురం మహేశ్, ఎంపీపీ విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దమ్మక్కపల్లి గ్రామస్తులు మూకుమ్మడిగా తమ ఓట్లు బీఆర్ఎస్‌కే వేస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, జానగిరి, నీలగిరి ఉన్నారు.

ఘనంగా దీపావళి సంబరాలు


మెదక్: లక్ష్మీ పూజలు నిర్వహిస్తున్న మహిళలు


చిన్నశంకరంపేటలో..

జిల్లా వ్యాప్తంగా ఆదివారం దీపావళి పండుగను ఘనంగా జరుపుకొన్నారు. ఆయా గ్రామాల్లో ప్రత్యేకంగా ఇళ్లల్లో, వ్యాపార, వాణిజ్య దుకాణాల వద్ద లక్ష్మీదేవి పూజలు భక్తితో నిర్వహించారు. అనంతరం చిన్న, పెద్ద కలిసి క్రాకర్స్, టపాసులు కాల్చి సందడి చేశారు.


కొల్చారం(నర్సాపూర్): తుక్కాపూర్ లో..


పెద్దశంకరంపేటలో..


శివ్వంపేటలో..


చిన్నశంకరంపేట మండలంలో..


టేక్మాల్‌లో ..


మెదక్: వ్యాపార కేంద్రాల ఎదుట టపాసులు కాల్చుతున్న కాలనీవాసులు

ఓటు హక్కుపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న కళాకారులు

రామాయంపేట(మెదక్): కలెక్టర్, సమాచార శాఖ వారి ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఓటు హక్కు వినియోగం అనే అంశంపైన తెలంగాణ సంస్కృతిక సారధి కళాకారులతో ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్రంలో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే

రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

మనోహరాబాద్(తూప్రాన్): రాష్ట్రంలో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, ప్రతిపక్షాలు కలగంటున్నాయని రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలు బీఆర్ఎస్ వైపే మొగ్గు చూపుతున్నారని, ప్రతి పక్షాలకు కార్యకర్తలు కరువయ్యారన్నారు. మనోహరాబాద్ మండలంలోని కాళ్లకల్, జీడిపల్లి, వెంకటాపూర్ అగ్రహారం, దమ్మక్కపల్లి గ్రామాలకు చెందిన పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, మండల బీఆర్ఎస్ నాయకులు పురం రవి, పెంటాగౌడ్, బాలకృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అత్తింటి వారిపై కోపంతో..

టవరెక్కి యువకుడి హల్ చల్

కొల్చారం(నర్సాపూర్): అత్తింటి వారు తనను పోలీస్ స్టేషన్‌కు పట్టించారంటూ యువకుడు విద్యుత్ టవర్ ఎక్కి హల్ చల్ చేసిన సంఘటన మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదుట సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పోతిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గిరిజన తండాకు చెందిన లంబాడి దేవిసింగ్ మద్యానికి బానిసై భార్యతో గొడవ పడేవాడు. ఆదివారం కూడా భార్యను అడ్డువచ్చిన అత్తను కూడా కొట్టాడు. దీంతో వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం అతన్ని స్టేషన్‌కు పిలిపించి పోలీసులు మందలించారు. దీంతో ఆయన మనస్థాపం చెంది పక్కనే ఉన్న కరెంట్ టవర్ ఎక్కాడు. తనకు న్యాయం జరిగే వరకూ దిగేది లేదంటూ బెదిరించాడు. ఇదే సమయంలో అక్కడికి ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి న్యాయం చేస్తామని భరోసా ఇవ్వడంతో యువకుడు టవర్ దిగివచ్చాడు.


విద్యుత్ టవర్ ఎక్కిన యువకుడు

బగలాముఖి ఆలయంలో పూజలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో కొలువైన బగలాముఖి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు, హోమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ భూదాత పబ్బ రమేశ్‌గుప్తా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా, సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, ఉప సర్పంచ్ పద్మ, వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.


అమ్మవారికి పూజలు చేస్తున్న పండితుడు

రఘునందన్‌రావును గెలిపించాలి

● బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం

చేగుంట(తూప్రాన్): మండలంలోని వడియారం గ్రామంలో సోమవారం బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కోకన్వీనర్ గోవింద్ మాట్లాడుతూ.. రెండున్నర ఏళ్లలో బీజేపీ ఎమ్మెల్యేగా రఘునందన్ రావు అందించిన సేవలు రోడ్ల నిర్మాణాలు, జాబ్ మేళతో యువతకు ఉపాధిని కల్పించిన అంశాలను వివరించారు. బీజేపీ తరపున పోటీ చేస్తున్న ఆయనను గెలిపించాలని కోరారు. బీజేపీ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు భూపాల్, లావణ్య, గిరిగౌడ్, రామకృష్ణ బీసీ సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గణేశ్‌రవికుమార్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.


వడియారంలో ఇంటింటి ప్రచారంలో బీజేపీ నాయకులు

రాష్ట్రోపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

నిజాంపేట(మెదక్): మండలంలోని రాష్ట్రోపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలను సోమవారం మండల కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ప్రణీద్ కుమార్, రాజగోపాల గౌడ్ ఆధ్వర్యంలో చల్మెడ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. ఈ మేరకు ఎలక్షన్ పరిశీలకులుగా రవీందర్ గౌడ్, ఇంద్రసేనా చారి వ్యవహరించారు. తెలంగాణ రాష్ట్రోపాధ్యాయ సంఘం నూతన అధ్యక్షుడిగా ఎస్ నవీన్ రత్నాకర్, ప్రధాన కార్యదర్శిగా, బి. శ్రీకాంత్, కోశాధికారిగా జి. శ్రీకాంత్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, మోహన్, కే.వై శ్రీధర్ రావు, సీహెచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం పడిపోయినా పట్టించుకోరా!

పాపన్నపేట(మెదక్): మండలంలోని అన్నారం గ్రామంలో విద్యుత్‌స్తంభం పడిపోయినా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలోని జన్ములవాడలో ఆదివారం విద్యుత్ స్తంభం పడిపోయింది. కేబుల్ నేలను తాకుతుంది. కేబుల్ ఎక్కడైనా తెగి ఉంటే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. పశువులతో కేబుల్ తెగిపోయే అవకాశం లేకపోలేదు. ఈ విషయమై గ్రామస్తులు విద్యుత్ సిబ్బందికి తెలిపినా.. వారు పట్టించుకోవడం లేదని చెప్పారు. ఈ విషయమై సబ్ ఇంజనీర్ సాయి కుమార్‌ను వివరణ కోరగా.. కొత్త స్తంభం ఏర్పాటు చేస్తామని కంట్రాక్టర్‌కు సూచించామన్నారు. తొందరలోనే చర్యలు తీసుకుంటామని చెప్పారు.


అన్నారంలో పడిపోయిన విద్యుత్ స్తంభం

కారుని ఢీకొట్టిన మినీ ట్రక్కు

శివ్వంపేట(నర్సాపూర్): మినీ ట్రక్కు కారును ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి.ఈ సంఘటన తూప్రాన్ – నర్సాపూర్ హైవే మండల పరిధిలోని దొంతి గ్రామ బస్టాండ్ వద్ద సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బొల్లారం గ్రామానికి చెందిన ఓ కుటుంబం తూప్రాన్ నుంచి నర్సాపూర్ వైపు కారులో వెళ్తున్నారు. ఈ క్రమంలో తూప్రాన్ వైపునకు వెళ్తున్న మినీ ట్రక్కు రోడ్డుపైకి వచ్చిన ఓ వ్యక్తిని తప్పించపోయి కారును ఢీ కొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న కృష్ణ, శశికళకు గాయాలయ్యాయి. వారిని స్థానికులు చికిత్స కోసం 108లో నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సన్మానం


సృజన్‌ను సన్మానిస్తున్న ఏసీపీ రమేశ్

గజ్వేల్‌రూరల్: జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారుడిని గజ్వేల్ ఏసీపీ రమేశ్ అభినందించారు. మండల పరిధిలోని ధర్మారెడ్డిపల్లికి చెందిన సృజన్‌కుమార్ జగదేవ్‌పూర్‌లోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో చదువుకుంటున్నాడు. వాలీబాల్‌పై ఉన్న ఆసక్తిని గుర్తించిన గజ్వేల్ కానిస్టేబుల్ సంతోష్‌కుమార్ ఆటలో సలహాలు, సూచనలు అందించాడు. ఇటీవల శ్రీనగర్‌లో జరిగిన అండర్– 17 నేషనల్ వాలీబాల్ పోటీలో సృజన్‌కుమార్ ప్రతిభ చాటాడు. ఈసందర్భంగా సోమవారం ఏసీపీ సన్మానించారు.

అనారోగ్యంతో హెచ్‌ఎం మృతి

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలం లకుడారం ప్రాథమిక పాఠశాలలో ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న శ్రీనివాస్ సోమవారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందాడు. గతేడాది సంగారెడ్డి జిల్లా నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. హెచ్‌ఎం మృతికి ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి సంతాపం తెలిపారు.

కేసీఆర్‌ను గెలిపిద్దాం

వర్గల్(గజ్వేల్): సీఎం కేసీఆర్ పాలనలో చెరువులు కళకళలాడుతున్నాయని బీఆర్ఎస్ జిల్లా యూత్ అధ్యక్షుడు నాగరాజు, మండల పార్టీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం వర్గల్ మండలం నాచారం, అనంతగిరిపల్లిలో పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

కాంగ్రెస్‌తోనే సుపరిపాలన

చిన్నకోడూరు(సిద్దిపేట): కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపిస్తే ప్రజలకు సుపరిపాలన అందుతుందని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు అన్నారు. సోమవారం చిన్నకోడూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌తోనే అన్నివర్గాల అభివృద్ధి సాధ్యమన్నారు. మంత్రి హరీశ్‌రావు మాయమాటలతో ప్రజలను మభ్యపెడుతున్నాడని, ప్రజలు నమ్మే స్థితిలో లేరని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు పరశురాములు, తదితరులు పాల్గొన్నారు.


ప్రమాదకరంగా మలుపులు

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని ధర్మారం ప్రధాన గేటు వద్ద మూలమలుపు ప్రమాదకరంగా ఉంది. రోడ్డుకు ఇరుపక్కల ఏపుగా పిచ్చిమొక్కలు పెరిగాయి. దీనికి తోడు ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కనబడటం లేదు. దీంతో వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి, మూలమలుపు వద్ద ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించి ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



ముందస్తుగా చిల్డ్రన్స్ డే వేడుకలు

తూప్రాన్: పట్టణంలోని గీతా స్కూల్‌లో ముందస్తుగా బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల మైదానంలో విద్యార్థులు 'చిల్డ్రన్స్ డే' ఆకారంలో కూర్చున్నారు. పాఠశాల కరస్పాండెంట్ పి.రామాంజనేయులు, చైర్ పర్సన్ పి.ఉష, ప్రిన్సిపాల్ సీహెచ్.వెంకటకృష్ణారావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రేంరాజ్ ఉపాధ్యాయులు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.


గులాబీ ఆకారంలో విద్యార్థులు